క్లుప్తంగా

31న ఆర్టీసీ లక్కీడిప్ డ్రా

మదనపల్లె సిటీ: మదనపల్లె–గాలివీడు సెక్టార్‌లో తిరిగే బస్సుల్లో ప్రయాణికులకు ఏర్పాటు చేసిన లక్కీ డిప్ డ్రాను 31న తీయనున్నట్లు ఆర్టీసీ 2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ప్రయాణికులు తమ టిక్కెట్ల వెనుకపై పేరు, సెల్‌ఫోన్ నంబర్‌ను బస్సు డ్రైవర్ సీటు వెనుక బాక్సులో వేయాలన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ఆర్టీసీని ఆదరించాలని కోరారు.

సారా విక్రేత అరెస్టు

మదనపల్లె: అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ ఎస్.ఐ హరిహరప్రసాద్ తెలిపారు. మండలంలోని నారమాకుతాండాకు చెందిన బాలాజీనాయక్ ఆదివారం పట్టణంలోని ఎస్‌వీఆర్ కళ్యాణ మండపం సమీపంలో సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మెకానిక్‌కు గాయాలు

మదనపల్లె: ద్విచక్రవాహన ప్రమాదంలో మెకానిక్ తీవ్రంగా గాయపడిన సంఘటన ములకలచెరువు మండలంలో ఆదివారం జరిగింది. కాలువపల్లెకు చెందిన అస్లాం (20) ద్విచక్ర వాహన మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంపై ములకలచెరువుకు బయలుదేరాడు. మార్గమధ్యంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో అస్లాం తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రెడ్డెమ్మకొండకు గోమాత దానం



గోదానం చేస్తున్న దాతలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయానికి గోమాత, దూడను దానంగా ఇచ్చారు. తిరుపతి పట్టణానికి చెందిన భరత్‌భూషణ్ కుటుంబ సభ్యులు సోమవారం ఆలయానికి చేరుకొన్నారు. ముందుగా గోమాత, దూడకు విశిష్టపూజలు నిర్వహించి ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, అర్చకులకు అందజేశారు. వీటిని ఆలయం తరపున సంరక్షిస్తామని చైర్మన్ తెలిపారు.

నేడు మల్లయ్యకొండ అన్నదాన కమిటీ సమావేశం

తంబళ్లపల్లె: ఆదర్శ పాఠశాల ఆవరణంలో మంగళవారం ఉదయం 10గంటలకు అన్నదాన సమావేశం నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు విజయభాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి తెలిపారు. శివరాత్రి పర్వదినానికి కొండకు వచ్చే భక్తులకు అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఉచిత అన్నసంతర్పణ చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు, నిర్వహణ బాధ్యతలు, నిధుల సమీకరణ అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

నేడు వాహనాల వేలం

మదనపల్లె : వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన మూడు మోటార్‌సైకిళ్లను మంగళవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వాహనాలు కొనుగోలు చేయాలని ఆసక్తి కలిగిన వారు ఉదయం 9.30 గంటలకు స్టేషన్‌కు చేరుకుని డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వేలం పాటలో పాడుకున్న వాహనాలకు సంబంధించి మొత్తానికి అదనంగా జీఎస్టీ 18 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం



గోదాదేవి కల్యాణం జరిపిస్తున్న ఆర్యవైశ్యులు

పీలేరు రూరల్ : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గోదాదేవి, రంగనాథుడిని శోభాయమానంగా అలంకరించారు. శాస్త్రోక్తంగా వేదపండితులు మంత్రోచ్ఛరణల నడుమ సంప్రదాయ బద్ధంగా కల్యాణం జరిపించారు. పలువురు ఆర్యవైశ్యులు కల్యాణం తిలకించారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి అమ్మవారిని పల్లకీలో కోలాటాల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో అరవింద్‌బాబు, సుప్రజ, నరేష్, స్వాతి దంపతులు, పలువురు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

మల్లయ్యను దర్శించుకున్న భక్తులు

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామిని సోమవారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామి పూజలు,అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



గుర్రంకొండలో చిట్లాకుప్పకు నిప్పు అంటించిన దృశ్యం



గుర్రంకొండలో అందంగా అలంకరించిన పాడిఆవు

మదనపల్లె సిటీ: తెలుగువారి తొలి పండుగ సంక్రాంతి వేడుకలు మదనపల్లెలో ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇళ్ల ముందు రంగు రంగు ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. ఇళ్లల్లో పిండివంటలు చేసి పితృదేవతలకు బట్టలు పెట్టి పూజలు చేశారు. స్థానిక అమినేనివీధిలో ముగ్గులు వేసి చెరుకుగడలతో అందంగా తీర్చిదిద్దారు. పి గోమాతను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు సూర్యదేవుడికి పూజలు చేశారు. స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక వృద్ధాశ్రమం, పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గోమాతలను రంగు రంగుల పువ్వులతో, బెలూన్లతో అలకరించి పూజలు చేశారు.కార్యక్రమంలో వెలుగు కార్యదర్శి ఉదయమోహన్, కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా కనుమ

మండలంలో కనుమ కనుల పండువగా జరిగింది. మదనపల్లె మండలం బసినికొండ, పోతబోలు, మాలేపాడు, సిద్దమ్మగారిపల్లె ప్రాంతాల్లో కనుమ పండుగ ఘనంగా నిర్వహించారు. పశువులను రంగు రంగు బెలూన్లు, పూలతో అలంకరించారు. మహిళలు గోవులకు పసుపు,కుంకుమ పెట్టి పూజలు చేశారు. గ్రామ పొలిమేర్లల్లో చిట్టాకుప్ప వద్దకు చేరుకుని సంప్రదాయబద్ధంగా పూజలు చేసి పశువులను చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

ఉత్సాహంగా కనుమ వేడుకలు

గుర్రంకొండ: మండల కేంద్రమైన గుర్రంకొండతో పాటు పలు గ్రామాల్లో కనుమ వేడుకలను సోమవారం ఉత్సాహంగా జరుపుకొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఉదయాన్నే పాడి ఆవులకు మంగళస్నానాలు చేయించి మహిళలు పూజలు నిర్వహించారు. రంగులతో పాడిఆవుల కొమ్ములకు రంగులు వేయించారు. పలు రకాల పుష్పాలతో వాటిని అందంగా అలంకరించారు. కలర్‌ఫుల్ బెలూన్లతో అలంకరించిన తీరు అందర్ని ఆకట్టుకొంది. మేళతాళాలతో పాడిఆవులను ఊరేగింపుగా గ్రామాలకు సమీపంలో ఉన్న చిట్లాకుప్ప వద్దకు తీసుకొచ్చారు పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకొన్నారు. చిట్లాకుప్ప వద్ద కొలువుదీర్చిన కాటమరాజుకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పాడిఆవులు రోగాల బారిన పడకుండా కాపాడమంటూ రైతులు మొక్కులు చెల్లించుకొన్నారు. అందంగా అలంకరించిన పాడిఆవులకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. ఆనంతరం చిట్లాకుప్పకు నిప్పు అంటించారు.

ఘనంగా సంబరాలు

కేవీపల్లె : మండల పరిధిలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆది, సోమవారం పలు గ్రామాల్లో కనుమ పండుగ నిర్వహించారు. ప్రతి ఇంటిముందు మహిళలు శోభాయమానంగా ముగ్గులు వేసి, గొబ్బెమ్మలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఉదయం ఇంటిముందు చల్లపెట్టి అనంతరం గ్రామస్తులంతా మూకుమ్మడిగా తీసుకెళ్లి గ్రామ సమీపంలో మంచినీటి బావుల్లో, చెరువుల్లో వేశారు. సాయంత్రం పశువులను రంగు రంగుల బెలూన్‌లు, వివిధ రకాల పూలతో అలంకరించారు. పశువులకు పూజలు నిర్వహించి గ్రామాల సమీపంలోని కాటంరాజు వద్దకు తోలుకు వెళ్లారు. అనంతరం చిట్లాకుప్పకు నిప్పంటించి భక్తులు, ప్రజలు వీక్షించారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట: ఏటా సంక్రాంతి పండగ సందర్భంగా నిర్వహించే పశువుల పండగ ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. మండలంలోని గ్రామాల్లో రైతులు పశువులకు స్నానం చేయించి బెలూన్లు, రంగురంగుల కాగితాలతో అలంకరించారు. పశువులను ఊరేగింపుగా గ్రామాలకు సమీపంలోని చిట్లా కుప్ప వద్దకు తీసుకొచ్చారు. చిట్లా కుప్పను కాల్చిన తర్వాత రహదారులపై మంటలు పెట్టి పశువులను దాటించారు. శ్రీజ డెయిరీ ఆధ్వర్యంలోనూ పశువుల పండగ నిర్వహించారు. బడికాయలపల్లె, ఎర్రమద్దివారిపల్లెలో వేడుకలను నిర్వహించి మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు మేనేజర్ కే.మల్లికార్జున బహుమతులు అందించారు.

కలకడలో..

కలకడ : మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. శని, ఆదివారం ఉదయం ప్రతి ఇంటిముందు గొబ్బెమ్మలు పెట్టి, పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణాల నుంచి గ్రామాలకు వచ్చిన యువకులు సంప్రదాయ దుస్తులు ధరించి పరస్పరం సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆదివారం పశువులను అలంకరించి గ్రామ దేవుడు కాటమరాజువద్ద చిట్లకుప్ప వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. గుమ్మడికాయలు, తొలిపంటగా చేతికి అందిన అనపకాయలు, అలసందలు ప్రసాదంగా పంపిణీ చేశారు.

ఘనంగా కనుమ పండగ

కురబలకోట: మండలంలో కనుమ పండగ ఘనంగా జరిగింది. పశువులను అందంగా అలంకరించి పూజించారు. బెలూన్లు కట్టి ఊరేగించారు. సాయంత్రం చిట్లాకుప్ప వద్ద పశువులను బెదిరించారు. మండలంలో జంగావారిపల్లెలో ఈ పండగ జోరుగా సాగింది.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి కనుమ పండుగను నిర్వహించారు. ఎద్దులు,పాడి ఆవులను అలంకరించి ఊరేగింపుగా కాటమరాజు గుడి వద్దకు తీసుకెళ్లారు. పశువుల ఊరేగింపు నిర్వహించి కాటమరాజుకు పూజలు చేసి, చిట్లీకుప్పకు నిప్పంటించి యువకులు కేరింతలు కొడుతూ పశువులను బెదిరించారు.

నిమ్మనపల్లె: మండల పరిధిలో సంక్రాంతి, కనుమ పర్వదిన వేడుకలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆదివారం పండుగ రోజున ప్రతి ఇళ్లు బంధు మిత్రుల రాకలతో కళకళలాడింది. ప్రతి ఇంటి లోగిలి రంగవళ్లులు, గొబ్బెమ్మలతో అందంగా అలంకరించుకున్నాయి. సోమవారం కనుమ రోజున మండలంలోని అగ్రహారం, బండమీదపల్లె, నిమ్మనపల్లె, సామకోటవారిపల్లె, వెంగంవారిపల్లె,రెడ్డివారిపల్లె, రాచవేటవారిపల్లె గ్రామాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక యువతి,యువకులు గ్రామమంతా చల్ల సేకరించి సంబరాలు ఊరేగింపుగా వెళ్లి గ్రామ సమీపంలో నదీజలాల్లో గంగాదేవికి చల్లను సమర్పించారు.

కలికిరిలో..

కలికిరి: సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా మకర సంక్రాంతి, కనుమ సంబరాలను మండల ప్రజలు కనుల విందుగా జరుపుకున్నారు. కలికిరి పట్టణ పరిధిలోని కలకడ మార్గం అంకాలమ్మ ఆలయం వద్ద సంక్రాంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు. పశువులను ప్రత్యేకంగా అలంకరించి చిట్లాకుప్ప వద్దకు తరలించారు.

పీలేరులో..

పీలేరు : పట్టణంలోని కామాటంపల్లె వద్ద కనుమ పండుగను సోమవారం సాయంత్రం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పశువులను బెలూన్‌లు, వివిధ రకాల పూలతో అలంకరించారు. కాటంరాజు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. అనంతరం చిట్లాకుప్పకు నిప్పంటించారు. వేల సంఖ్యలో భక్తులు, ప్రజలు పాల్గొని చిట్లాకుప్పను వీక్షించారు.



కదిరాయచెర్వులో పశువులను అలంకరించిన దృశ్యం



బి.కొత్తకోట: బడికాయలపల్లెలో పశువులను అలంకరించిన దృశ్యం



కేవీపల్లె : గ్యారంపల్లెలో ప్రత్యేకంగా అలంకరించిన కాడెద్దులతో రైతు



కురబలకోట: జంగావారిపల్లెలో పశువులను అలంకరణ

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే

మదనపల్లె: నియోజకవర్గంలోని రామసముద్రం మండలం, వాలీశ్వరస్వామి కొండపై జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పరామర్శించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటెన్సివ్ కేర్‌లో ఉన్న బాధితులతో మాట్లాడారు. త్వరగా కోలుకుంటున్నారని ధైర్యం చెప్పారు. వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మాజీ సైనికులకు సన్మానం

మదనపల్లె : సైనిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులునాయుడు అధ్యక్షతన మణప్పురం రితి జ్యువలరీ ఆధ్వర్యంలో మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కంచర్లశ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ ప్రతిఏటా జనవరి 15న ఇండియన్ ఆర్మీ డే ఆనవాయితీగా జరుపుకోవడం జరుగుతోందన్నారు. దేశాన్ని రక్షించే భారత సైన్యం శౌర్యపరాక్రమాలను గుర్తు చేసుకుంటూ మాజీ సైనికులను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికులు వెంకటరమణారెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డి, చలపతి తదితరులు పాల్గొన్నారు.



మాజీ సైనికులను సన్మానిస్తున్న దృశ్యం

మల్లేశ్వరస్వామికి పంచలోహ తొడుగు

నిమ్మనపల్లె: మండలంలోని తవళం అటవీప్రాంతంలో నెలవైన యోగనేలమల్లేశ్వరస్వామికి సోమవారం మదనపల్లెకు చెందిన దాతలు సుధాకర్, విజయలక్ష్మి దంపతులు పంచలోహ తొడుగును బహూకరించారు. రూ.72 వేలు విలువ చేసే స్వామి అలంకరణ తొడుగును ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణకు అందజేశారు. మిట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో పని చేస్తున్న లెక్చరర్ విజయలక్ష్మి స్వామికి మొక్కుల చెల్లింపుల్లో భాగంగా పంచలోహ తొడుగు అందజేసినట్లు తెలిపారు. ఆలయ అర్చకులు శంకర శాస్త్రి వారికి తీర్థప్రసాదాలు,స్వామి శేషవస్త్రాన్ని అందజేశారు.



పంచలోహ తొడుగు అలంకరణలో యోగనేలమల్లేశ్వరస్వామి

పలువురు జూదరుల అరెస్ట్

పెద్దతిప్పసముద్రం: మండలంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఎస్ఐ మధురామచంద్రుడు సిబ్బందితో కలసి కోడి పందేల స్థావరాలపై దాడులు నిర్వహించారు. మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ కాప్పల్లి సమీపంలో ప్యాయల సురేష్, గిరిగి రమేష్, నెలవంకి రమేష్, ప్యాయల రాజన్న, మేకల వెంకట్రాయప్ప, ఆర్‌వీ రమేష్‌లు పట్టుబడ్డారు. వారి నుంచి 10,200ల నగదుతో పాటు మూడు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నారు. టి.సదుం పంచాయతీ సమీపంలోని చింతచెట్టు వద్ద ఎంవీ రవిచంద్ర, కుళ్ళాయప్ప, అంజనప్పలు పట్టుబడగా వారి నుంచి 1,250ల నగదుతో పాటు ఓ కోడి పుంజును స్వాధీనం చేసుకున్నామని సోమవారం ఎస్ఐ పేర్కొన్నారు.

నలుగురు అరెస్టు

ములకలచెరువు: మండలంలో కోడిపందెం ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ డీవై స్వామి సోమవారం తెలిపారు. సోంపల్లి పంచాయతీ సానేవారిపల్లె వద్ద కోడిపందెం ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. నలుగురిని అరెస్టు చేసి రూ.3,300 వేల నగదు, రెండు కోళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్ట్

బి.కొత్తకోట: మండలంలోని తుమ్మనంగుట్ట పంచాయతీ బండమీదకొత్తపల్లెలో పేకాట ఆతుండగా దాడులు చేసి నలుగురిని అరెస్ట్‌చేసినట్లు సోమవారం ఎస్ఐ కే.రామమోహన్ తెలిపారు. జూదరుల నుంచి రూ.31,780 నగదు స్వాధీనం చేసుకొన్నామని తెలిపారు.

రామసముద్రం: మండలంలోని చెంబకూరు పంచాయతీ సమీపంలోని టేకుపల్లె గ్రామ పరిసర ప్రాంతాల్లో కోడిపందాలు ఆడుతున్నారన్న సమాచారంతో రామసముద్రం ఎస్ఐ రవీంద్రబాబు తన బృందంతో దాడులు చేసినట్లు తెలిపారు. ఆదివారం సాయంత్రం చెంబకూరు పంచాయతీ టేకుపల్లి చెరువు పక్కన ఖాళీ ప్రదేశంలో ఐదుగురు కోడిపందేలు ఆడుతుండగా అరెస్ట్ చేసి , వారి వద్ద నుంచి రూ.3200 నగదు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



పెద్దతిప్పసముద్రం: పట్టుబడిన నిందితులతో పోలీసులు

సబ్సిడీ ఎరువులను సద్వినియోగం చేసుకోవాలి

గుర్రంకొండ: ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందిస్తున్న ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని సింగిల్‌విండో చైర్మన్ వెంకటశివారెడ్డి, ఏఓ రత్నమ్మ అన్నారు. సోమవారం మండలంలోని ఎల్లుట్ల ఆర్బీకేలో రైతులకు సబ్సిడీ యూరియాను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని ఆర్బీకేల్లో ప్రస్తుతం యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులకు మార్కెట్ ధర కంటే తక్కువకే సబ్సిడీపై ప్రభుత్వం యూరియా అందిస్తోందన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు

ఆత్మీయ సమ్మేళనం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

తంబళ్లపల్లె: మండలంలోని గోపిదిన్నె ఉన్నత పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్వ విద్యార్థులు గత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. చౌడేపల్లె మండలం ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్‌నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. నాటి గురువులకు పాదపూజ చేసి వారి ఆశీస్సులు అందుకున్నారు. స్థానిక సర్పంచ్ సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల కోరిక మేరకు పూర్వ విద్యార్థులు రూ.23వేల ఖర్చుతో సైనిల్ షెడ్డు ఏర్పాటు చేసి ప్రారంభించారు.

అ'పూర్వ' కలయిక



గురువులను సత్కరించిన పూర్వ విద్యార్థులు

కేవీపల్లె : మండలంలోని కేవీపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల 1991–92 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక జరిగింది. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమ తీపి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. అనంతరం తమకు చదువుచెప్పిన అప్పటి గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అప్పటి ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్య ఎవరూ దొంగలించలేని ఆస్తి అని పేర్కొన్నారు. 30 ఏళ్ల తరువాత చదువుచెప్పిన గురువులను మరచిపోకుండా సత్కరించడం అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు.

పెరిగిన ఓటర్ల నమోదు శాతం

- తంబళ్లపల్లె ఓటర్లు 2.15 లక్షల మంది
- ఎనిమిదేళ్లలో పెరిగింది 16వేల ఓటర్లు
- మహిళా ఓటర్లే అధికం

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గంలో గత ఎనిమిదేళ్లలో 16వేల మంది ఓటర్లు పెరిగారు. ఆరు మండలాల్లో ఏటా ఓటర్ల సంఖ్య పెరుగుతోంది. ఇందులో బి.కొత్తకోట నగర పంచాయతీ, బి.కొత్తకోట మండలంలోనే ఓటర్ల సంఖ్య అత్యధికం. 2014 ఎన్నికల్లో 220 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఓటర్ల సంఖ్య 1,99,084 మంది. 2019 ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య 2,09,834 మందికి పెరిగింది. వీరిలో స్త్రీలు 1,05,151 మంది, పురుషులు 1,04,670 మంది ఓటర్లున్నారు. తాజాగా ప్రకటించిన ఓటర్ల జాబితా మేరకు నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 2,15,096 పెరిగాయి. పోలింగ్ కేంద్రాలు 233కు పెరిగాయి. మండలాలవారీగా బి.కొత్తకోట మండలంలో 48,052 మంది ఓటర్లు, ములకలచెరువు మండలంలో 35,789 మంది, తంబళ్లపల్లె మండలంలో 31,370 మంది, పెద్దమండ్యం మండలంలో 26,565 మంది, పెద్దతిప్పసముద్రం మండలంలో 39,519 మంది, కురబలకోట మండలంలో 32,463 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లలో పురుషులు 1,06,881 మంది ఉండగా మహిళా ఓటర్లు 1,08,204 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 1,325 మంది అధికం. పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం మండలాల్లో పురుష ఓటర్ల అధికం కాగా మిగిలిన నాలుగు మండలాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. వీరుకాక ట్రాన్స్‌జెండర్లు తంబళ్లపల్లెలో ఇద్దరు, పెద్దమండ్యంలో నలుగురు, పెద్దతిప్పసముద్రంలో ఒకరు, బి.కొత్తకోటలో నలుగురు ఓటు హక్కు కలిగి ఉన్నారు.

సంక్రాంతి సంబరాల్లో మంత్రి రోజా

సంబేపల్లె : మండలంలోని శెటిపల్లె గ్రామం తిమ్మక్కగారిపల్లెలో జరిగిన సంక్రాంతి సంబరాలలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా పాల్గొన్నారు. ఆమె సోదరుడు మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రారెడ్డి స్వగృహంలో నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోమాతకు పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన ముగ్గుల పోటీలలో ఆమె పాల్గొని గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కవిత, రాయలసీమ విద్యాసంస్థల అధినేత ఆనంద్‌రెడ్డి, రోజా కుటుంబ సభ్యులు, ఉపేంద్రారెడ్డి కుటుంబసభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈవెంట్ పోస్టర్ ఆవిష్కరణ

మంత్రి రోజా యువతేజ కల్చర్ ఈవెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువతేజ వారి కల్చరల్ ఈవెంట్స్‌ను ఆసక్తి ఉన్న వారు సద్వినియోగపరచుకోవాలని సూచించారు. ఈవెంట్ ఆర్గనైజర్ అనిల్‌కుమార్, నాయకులు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి, ఎంపీలకు ఘనస్వాగతం

సంబేపల్లె : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్‌రెడ్డిలకు మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. వీరబల్లిలోని పెద్దిరెడ్డి బంధువుల ఇంటికి వెళ్తున్న మంత్రి, ఎంపీలకు గుట్టపల్లెలోని చిదంబర్‌రెడ్డి నివాసం వద్ద శాలువా, పూలమాలలు వేసి స్వాగతం పలికారు. అనంతరం తేనీటి విందుకు స్వీకరించిన వారు వీరబల్లికి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

నేడు కృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ

రాజంపేట : రాజంపేట వైఎస్సార్ సర్కిల్‌లోని రాయచోటి రోడ్డు సెంటర్‌లో ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణదేవరాయల విగ్రహావిష్కరణను మంగళవారం నిర్వహించనున్నట్లు రాజంపేట మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవికుమార్ తెలిపారు. విగ్రహావిష్కరణకు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి పాల్గొంటున్నారు.